క్లుప్తంగా

దర్గాలు, పంజాల వద్ద పారిశుద్ధ్య పనులు



మచిలీపట్నంటౌన్: ఈ నెల 29వ తేదీన మొహర్రం దుఃఖదినాల సందర్భంగా నగరంలోని దర్గాలు, పంజాల వద్ద మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. 27వ డివిజన్‌లోని వంకాయ పంజాతో పాటు ఇతర పంజాలు, దర్గాల వద్ద పారిశుద్ధ్య పనులను గురువారం నిర్వహించారు. పనులను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ అచ్చెబా పర్యవేక్షించారు.

పంటకాలువలో గుర్రపు డెక్క తొలగింపు



అవనిగడ్డ: ప్రధాన పంట కాలువలో సీతాయిలంక వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను కూలీలతో తొలగించారు. ఈ ప్రాంతంలో కాలిబాట వంతెన వద్ద గుర్రపు డెక్క పెద్దఎత్తున పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు కూలీలతో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

దీనులకు రక్షణ సైన్యం సేవలు ఎనలేనివి



నాగాయలంక: 700 గ్రామాల్లోని దీనులకు రక్షణ సైన్యం (సాల్వేషన్ ఆర్మీ) సేవలు ఎనలేనివని రక్షణ సైన్యం జిల్లా అధికారి మేజర్ తెలగతోటి ప్రసాదరావు అన్నారు. రక్షణ సైన్యం నాగాయలంక డీఓ ఆధ్వర్యంలో స్థానిక బోసు బొమ్మ సెంటర్‌లోని కార్యాలయం ఆవరణలో సంస్థ ఇండియా సెంట్రల్ టెర్రిటరీ 128వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రసాదరావు మాట్లాడుతూ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న తెలుగు గడ్డపై 1895లో విజయవాడలో తొలుత స్టాఫ్ కెప్టెన్ అబ్దుల్ అజీజ్ ఈ సంస్థను ప్రారంభించారని, ప్రస్తుతం 700 గ్రామాల్లో వేలాది మంది అభాగ్యులకు సంస్థ అమూల్యమైన సేవలు అందిస్తోందని చెప్పారు. స్థానిక వ్యాపారవేత్త ప్రసాద్ రక్షణ సైన్యం ధ్వజాన్ని ఎగురవేసి, సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళా విభాగం జిల్లా అధికారి మేజర్ దీనరత్నకుమారి, మేజర్ డి.రాజేశ్వరరావు, మేజర్ డి.ప్రమీరాసుందరి, కెప్టెన్ జి.రాజకుమార్, లెఫ్టినెంట్ రామాంజనేయులు, సత్యవతి, అఖిల్, అనిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆర్టీసీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఫౌండర్స్ బ్రాంచ్ ప్రాంతంలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

మైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

కోనేరుసెంటర్: మైనర్‌ను వేధిస్తున్న ఓ యువకుడిపై మచిలీపట్నం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మచిలీపట్నం అరుణోదయ కాలనీకి చెందిన మట్టా మోహన కృష్ణ పెయింటింగ్ పనులు చేస్తుంటాడు.అదే కాలనీకి చెందిన ఓ బాలిక (13) ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె స్కూల్‌కు వెళ్లే సమయంలో మోహనకృష్ణ వెంబడిస్తూ ప్రేమ పేరుతో వేధించేవాడు. ఈనెల 17వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికను బయటికి పిలిచి అసభ్యకరంగా మాట్లాడాడు. జరిగిన విషయాన్ని బాలిక తల్లికి చెప్పింది. విషయం తెలుసుకున్న ఆమె అదే రోజు మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో మోహనకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన పోలీసులు మోహనకృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా తన బిడ్డపై అన్యాయంగా కేసు కట్టించారంటూ మోహనకృష్ణ తల్లి మట్టా శివకుమారి బాలిక ఇంటికి వెళ్లి తల్లిని నిలదీసింది. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య కొట్లాట జరిగింది. ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇరువర్గాలపై నమోదు చేశారు.

సేవలు మరింత చేరువ

- అందరికీ పథకాలు అందాలన్నదే లక్ష్యం
- మంత్రి జోగి రమేష్
- జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు అందజేత

పెడన: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఏవైనా కారణాల వల్ల సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో పథకాలు అందుకోలేని వారిని గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఈ కార్యక్రమంలో అందిస్తున్నామని చెప్పారు. మండలంలోని చెన్నూరు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. లబ్ధిదారులకు 346 ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు. వలంటీర్లను సన్మానించారు. పలువురికి ఓటీఎస్ శాశ్వత భూ హక్కు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందని వారుంటే వారి వివరాలను వలంటీర్లు నమోదు చేసుకుని పరిశీలించి సదరు పథకాన్ని అందజేస్తారని చెప్పారు. ఇప్పటికే అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించామని చెప్పారు. నిరుపేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. అన్నివర్గాలను అన్ని విధాలుగా ఆదుకుంటూ మన పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని చెప్పారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుతరావు, కొండవీటి నాగబాబు, రామానాయుడు, బెజవాడ నాగబాబు, వైస్ ఎంపీపీ యాదం రెడ్డి వరప్రసాద్, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



చెన్నూరులో ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

సద్వినియోగం చేసుకోవాలి..

కోడూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎఫ్ఓ, మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లిపాలెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 342 మందికి సర్టిఫికెట్లను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి చేతుల మీదుగా అందించారు. ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, సర్పంచులు వెర్రి పావని, కొక్కిలిగడ్డ భిక్షాలు, ఎంపీటీసీ సనకా శైలజ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు పాల్గొన్నారు.

పల్లెతుమ్మలపాలెం, మేకవానిపాలెంలో..

కోనేరుసెంటర్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధి పల్లెతుమ్మలపాలెం, మేకవానిపాలెం సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. పల్లెతుమ్మలపాలెంలో పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు 100 ధ్రువీకరణ పత్రాలను, మేకవానిపాలెంలో 262 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. బందరు తహసీల్దార్ శ్రీవిద్య, నాయకులు కె. దుర్గయ్య, ఎం. వెంకటేశ్వరరావు, వి. నాగార్జున, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.



ఉల్లిపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రావివారిపాలెంలో..

రావివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెంలో జగనన్న సురక్ష శిబిరం తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్ మాట్లాడారు. 667 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్‌కుమార్, ఈఓపీఆర్డీ అశోక్, గ్రామ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

గూడూరు: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించాన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం కప్పలదొడ్డిలో ఏర్పాటు చేసిన శిబిరంలో మంత్రి లబ్ధిదారులకు 700 ధ్రువీకరణ పత్రాలను అందజేసి మాట్లాడారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రోజుల తరబడి కాళ్లరిగేలా తిరిగితే గానీ పనులు కాని పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు గడప గడపకు అందించారని చెప్పారు. అయినప్పటికీ ఎవరైనా అర్హులై ఉండి సరైన ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందలేని వారుంటే వారికి కూడా లబ్ధి చేకూర్చాలన్న బృహత్తర లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఐదో విడత నేతన్న నేస్తం ద్వారా చేనేత కార్మికుల ఖాతాలలో రూ.24 వేలు జమ చేయడానికి శుక్రవారం జగనన్న బటన్ నొక్కనున్నారని మంత్రి తెలిపారు.

మాట్లాం, కృత్తివెన్ను గ్రామాల్లో..

కృత్తివెన్ను: మాట్లాం, కృత్తివెన్ను గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్‌లను ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమమే జగనన్న సురక్ష అని చెప్పారు. మాట్లాం గ్రామంలో 1,160 మందికి, కృత్తివెన్నులో 893 మందికి ఉచితంగా వివిధ రకాల సర్టిఫికెట్‌లను అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, డీటీ శశికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధి గరాలదిబ్బ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుండి మంజూరైన రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. గ్రామాల్లో అవసరమైన వసతులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయడం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనతో గ్రామాలు సస్యశ్యామలంగా వర్ధిల్లుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి ఒడుగు వెంకట నారాయణ, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

నాగాయలంక: జగనన్న సురక్ష శిబిరం శుక్రవారం నాచుగుంట, ఎదురుమొండి సచివాలయాల పరిధిలో నిర్వహిస్తామని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని చెప్పారు. షెడ్యూల్ ముగింపు రోజు ఈనెల 26న మండల కేంద్రంలోని నాగాయలంక-1, నాగాయలంక-2 సచివాలయాల వద్ద సురక్ష శిబిరాలు జరుగుతాయని చెప్పారు.

లింగన్నకోడు డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నరసింహపురం గ్రామం వద్ద లింగన్నకోడు డ్రెయిన్ పూడికతీత పనులను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించి మాట్లాడారు. దివిసీమలోని తీరప్రాంత రైతులు మురుగు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీని శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీ ఇప్పటికే ఈ ప్రాంతంలో పరిశీలన చేశారని చెప్పారు. చివరి భూమికి కూడా పూర్తి స్థాయిలో సాగునీటిని అందిస్తామన్నారు.

ప్రస్తుతం లింగన్నకోడు, రత్నకోడు డ్రెయిన్ల ద్వారా పొలాల్లో మురుగు బయటకు పోవాల్సి ఉండగా.. వీటిల్లో తూడు అల్లుకుపోవడంతో వర్షాల సమయంలో పొలాల్లో మురుగు బయటకు వెళ్లడం లేదన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని రైతులకు మేలు జరిగేలా లింగన్నకోడు డ్రెయిన్‌లో జయపురం నుంచి ఉల్లిపాలెం వరకు 12.5 కిలోమీటర్ల మేర పూడకతీత చేపట్టామని చెప్పారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.32.5 లక్షల నిధులు కేటాయించిందని వివరించారు.



పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఉనికిని చాటుకునేందుకే ప్రతిపక్షాల విమర్శలు..

ప్రభుత్వంతో పాటు తనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉనికిని చాటుకునేందుకే ప్రతిపక్ష పార్టీల నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వీటిపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ప్రజలు తమను మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జోగి రమేష్
- కప్పలదొడ్డిలో వెల్‌నెస్ సెంటర్, సీసీ రోడ్లు ప్రారంభం

గూడూరు: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. కప్పలదొడ్డి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.17లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి జోగి రమేష్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మంచి చేయలేదని మంత్రి దుయ్యబట్టారు. ఇన్నాళ్లూ ప్రజల సంక్షేమం పట్టని టీడీపీ నాయకులు ఇప్పుడు ఏదో గ్యారంటీ అంటూ మళ్లీ ప్రజలను మభ్యపెట్టడానికి ఇళ్లకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మ వద్దని ప్రజలకు మంత్రి సూచించారు. యువగళం అంటూ లోకేష్ చేస్తున్న పాదయాత్రకు ఆనాడు జగనన్న చేసిన పాదయాత్రకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ప్రజలకు గ్యారంటీ అని మంత్రి జోగి రమేష్ అన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమలు సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఆర్బీకే చైర్మన్ పర్వం పెదబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, పెడన ఏఎంసీ చైర్మన్ గరికపాటి చారుమతి, సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీడీఓ డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కప్పలదొడ్డిలో సీసీ రోడ్లను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

సమగ్ర ఓటరు సర్వేకు సహకరించండి

పెడన: పెడన నియోజకవర్గంలో సమగ్ర ఓటరు సర్వేకు సహకరించాలని, తద్వారా పూర్తి స్థాయిలో ఓటరు జాబితాలను పారదర్శకంగా, సమగ్రంగా సిద్ధం చేసేందుకు వీలవుతుందని ముడా వైస్ చైర్మన్, పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె పెడన తహసీల్దార్ కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమగ్ర ఓటరు సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, ఒక ఓటరు వేర్వేరు చోట్ల నమోదై ఉంటే బీఎల్‌ఓలకు తెలియజేయాలన్నారు. శుక్రవారం నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వచ్చి పరిశీలిస్తారని, ఆ సమయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా బీఎల్‌ఓలకు పూర్తి సహాయ సహకారాలను అందించి పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు. ఎక్కడైనా ఏమైనా పొరపాట్లు జరిగితే తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండారు మల్లికార్జునరావు, జోగి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్. అప్పారావు, సీపీఎం, సీపీఐ, బీజేపీ, జనసేన నాయకులు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో రాజ్యలక్ష్మి

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం



మచిలీపట్నంటౌన్: నగరంలోని ది విశాఖ పట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. గాంధీబొమ్మ శివాలయం సెంటర్‌లోని బ్యాంకు ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులు ఇద్దరికి రూ. 10 వేలు, ఇంటర్ విద్యార్థులు నలుగురికి రూ. 30 వేలు, ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ. 10 వేలను బ్యాంక్ డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు, పొట్లూరి వెంకట రమణారావు చేతుల మీదుగా అందజేశారు. డైరెక్టర్లు మాట్లాడుతూ బ్యాంక్ సేవా కార్యక్రమాలను వివరించారు. బ్యాంక్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 363 మంది విద్యార్థులకు రూ. 23,37,500 నగదు ప్రోత్సాహకంగా అందించామని చెప్పారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన 161 మంది విద్యార్థులకు రూ. 8.05 లక్షలు, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన 195 మంది విద్యార్థులకు రూ. 14.62 లక్షలు, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు రూ. 70 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించామని వివరించారు. బ్రాంచ్ మేనేజర్ కేఎస్ అజయ్‌కుమార్, జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మధులతకు పీహెచ్‌డీ ప్రదానం



కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థిని వీరపనేని మధులతకు యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ జి. జ్ఞానమణి గురువారం పీహెచ్‌డీని పట్టాను అందజేశారు. మధులత బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ప్రాక్టీసెస్ ఇన్ సెలెక్ట్ పబ్లిక్ ఎండ్ ప్రైవేట్ బ్యాంక్స్ ఎ కంపేరిటివ్ స్టడీ అంశంపై చేసిన పరిశోధనకు సంబంధించి పీహెచ్‌డీ అందజేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్. కిరణ్ కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ అధ్యాపకురాలు పద్మజ పాల్గొన్నారు.

తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయాలు

జిల్లా పౌర సరఫరాల అధికారి పార్వతి

పెడన: ఎంపిక చేసిన రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పును అందిస్తున్నామని జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి అన్నారు. పెడన రైతుబజారులో సబ్సిడీపై కందిపప్పు, బియ్యం విక్రయాలను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పది రైతుబజారులలో స్థానికంగా ఉండే రైస్ మర్చంట్స్ అసోసియేషన్, వర్తక వాణిజ్య మండలి వారి సంయుక్త ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పును తక్కువ ధరకు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఆయా సంఘాల నాయకులు తక్కువ ధరలకు పేదలకు అందించేందుకు ముందుకు రావడాన్ని అభినందించారు. కిలో సాధారణ బియ్యం రూ.38 ఉంటే రైతు బజారులో రూ.32 లకు ఇస్తున్నామని చెప్పారు. బీపీటీ కిలో రూ.46లకు, సోనామసూరి కిలో రూ.48లకు, కిలో కందిపప్పు రూ.135లకు రైతు బజారులో విక్రయిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వర్తక వాణిజ్య మండలి నాయకులు బొలిశెట్టి బాలరాజు, రైస్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు కైతేపల్లి వెంకటరమణ, ఈఓ అమీద్, సూపర్‌వైజర్ సురేష్ పాల్గొన్నారు.



రైతు బజారులో తక్కువ ధరకు బియ్యం అందజేస్తున్న డీఎస్ఓ పార్వతి

27న హుండీ కానుకల లెక్కింపు

పామర్రు: ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వీరాంజనేయస్వామి ఆలయంలోని హుండీ కానుకలను ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు లెక్కిస్తారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళల ఆర్థికాభ్యున్నతికి సీఎం జగన్ కృషి

- త్వరలో మచిలీపట్నంలో జగనన్న మహిళా మార్ట్
- మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా మిషన్) రాష్ట్ర డైరెక్టర్ వి. విజయలక్ష్మి అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ హాల్‌లో గురువారం మెప్మా రిసోర్స్‌పర్సన్ (ఆర్పీ)లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ మహిళల ప్రగతి కోసం అర్బన్ మార్కెట్లు, ఈ-మార్ట్, సెల్లార్ పాయింట్లు, మహిళామార్ట్‌లు, ఆహా క్యాంటీన్ల ద్వారా డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. పట్టణాలు, నగరాల్లోని డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో జగనన్న మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేయిస్తూ వచ్చే ఆదాయాలతో మహిళా సంఘాలు బలోపేతమయ్యేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది పట్టణాల్లో జగనన్న మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. 9వ మార్ట్‌ను మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఒక్కొక్క సభ్యురాలు రూ. 150 చొప్పున పెట్టుబడి రుణంగా అందిస్తే నగరంలో జగనన్న మహిళామార్ట్ ను ఏర్పాటు చేస్తామన్నారు. దీని ద్వారా వచ్చే లాభాలను ప్రతి సంవత్సరం డివిడెండ్ల రూపంలో సభ్యులకు పంచుతారని చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడారు. మెప్మా సిటీ మిషన్ కో-ఆర్డినేటర్ బసవేశ్వరరావు, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మెప్మా పీడీ బి. ఇమ్మానియేల్, ఎస్ఎంఎం ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

హైవే పచ్చతోరణంలో రెడ్‌క్రాస్ భాగస్వామ్యం

చల్లపల్లి సబ్ బ్రాంచ్ వంద మొక్కల వితరణ

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారి-216కు ఇరువైపులా మొక్కలు నాటే ప్రక్రియలో రెడ్‌క్రాస్ చల్లపల్లి శాఖ భాగస్వామ్యం అభినందనీయమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా చైర్మన్ తోట ఎస్ఎస్ బాలాజీ అన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక జాతీయ రహదారి- పెద్దకళ్లేపల్లి రోడ్ క్రాస్ వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వంద పారిజాత పుష్పాల మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా చైర్మన్ ప్రారంభించారు. గత ఎనిమిదేళ్లుగా డాక్టర్ డీఆర్కే ప్రసాద్-డాక్టర్ టి.పద్మావతి దంపతులు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం ద్వారా రహదారుల వెంట 25 వేల మొక్కలు నాటి సంరక్షించి పెంచడం ఆదర్శనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు, జాతీయ రహదారిపై పచ్చని, చల్లని వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, ట్రెజరర్ కొండపల్లి రాంబాలాజీ, స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్, సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, పేరం మధుసూదనరెడ్డి, జిలానీ, సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బాలాజీ

వెదసాగులో జాగ్రత్తలు తప్పనిసరి

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో రైతులు వెద పద్ధతిలో వరిసాగు చేసిన పొలాలను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఎస్. జ్యోతిరమణి, మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన వరి శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ వెదసాగులో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. చౌడు భూముల్లో వెద పద్ధతిలో వరి సాగు అంత అనుకూలం కాదని, నాటు పద్ధతే శ్రేయస్కరమని చెప్పారు. సాగునీరు నేలలో ఇంకిపోకుండా బయటకు పారుదలయ్యేలా చూసుకోవాలన్నారు. చౌడు నేలల్లో అధికంగా జింకు, ఐరన్ లోపాలను గమనిస్తే చిలామిన్ జింకును లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున, అన్నభేది 2.5 నుంచి 5 గ్రాములకు చిటికెడు ఉప్పు లేదా నిమ్మ ఉప్పు కలిపి విడివిడిగా రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ కె. శ్రీనివాస్, పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు, సర్పంచ్ చినబాబు, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దోసపాడు(పెదపారుపూడి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ఏ దివాకర్ అన్నారు. దోసపాడు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం, గుడ్లు పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com